క్లుప్తంగా

పోలింగ్ కేంద్రాల పరిశీలన

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): కొత్తపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని పోలింగ్ కేంద్రాలను గురువారం సీఐ గణేష్ పరిశీలించారు. స్టేషన్ పరిధిలోని చిట్టినగర్, వించిపేట, గొల్లపాలెం గట్టు, లంబాడీపేట, కేఎల్‌రావునగర్ పరిధిలోని ప్రైవేటు పాఠశాలతో పాటు పాలప్రాజెక్టు సమీపంలోని సయ్యద్ అప్పలస్వామి కళాశాల, కేబీఎన్ కళాశాలలోని పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేశారు. రానున్న అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో స్టేషన్ పరిధిలోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించడంతో పాటు సిబ్బందికి పలు సూచనలు ఇచ్చామని గణేష్ పేర్కొన్నారు. పోలింగ్ కేంద్రాల వివరాల నమోదు చేసుకోవడంతో పాటు ఆయా స్టేషన్ల మధ్య ఎంత దూరం ఉంది, పరిశీలించిన పోలింగ్ కేంద్రాల్లో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల గురించి ఆరా తీశారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు.

ఏఆర్ ఏడీసీపీగా కోటేశ్వర రావు బాధ్యతల స్వీకరణ



విజయవాడస్పోర్ట్స్: ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్ ఏఆర్ అడిషనల్ డెప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ (ఏడీసీపీ)గా కుంభా కోటేశ్వర రావు గురువారం ఉద్యోగ బాధ్యతలు తీసుకున్నారు. సాధారణ బదిలీల్లో భాగంగా గుంటూరు ఏఆర్ ఏఎస్పీగా పని చేస్తున్న ఆయన ఎన్టీఆర్ కమిషనరేట్‌కు నియమితులయ్యారు. బాధ్యతలు తీసుకున్న అనంతరం పోలీస్ కమిషనర్ టి.కె.రాణాను మర్యాదపూర్వకంగా కలుసుకుని పుష్పగుచ్ఛం అందజేశారు.

వన్‌టౌన్ లిమిట్స్‌లో పోలీసుల తనిఖీలు



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వన్‌టౌన్ పోలీసుస్టేషన్ పరిధిలో నిషేధిత పొగాకు, గంజాయి వంటి విక్రయాలు, రవాణాకు అడ్డుకట్ట వేస్తూ స్థానిక స్టేషన్ సీఐగా పగ్గాలు చేపట్టిన ఈ దుర్గాశేఖరరెడ్డి గురువారం సాయంత్రం సోదాలు చేపట్టారు. బాబురాజేంద్రప్రసాద్ రోడ్డు, సామారంగంచౌక్, మెయిన్‌బజార్, రమణయ్య కూల్‌డ్రింక్‌షాప్ సెంటర్, తారాపేట రైల్వేస్టేషన్ సెంటర్, మల్లికార్జునపేట తదితర ప్రాంతాల్లో నూతన సీఐ తన సిబ్బందితో కలిసి పర్యటించారు. ఆయా ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు. త్వరలో జరుగుతున్న ఎన్నికల నేపథ్యంలో ఆయా పరిధుల్లో ఉన్న పోలింగ్‌బూత్‌లను పరిశీలించారు. వసతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా దుర్గాశేఖర రెడ్డి మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలు, నేరస్తుల కదలికలపై నిఘా ఉంటుందన్నారు. ఎస్ఐలు వి. రమ్యశ్రీసత్య తదితరులు పాల్గొన్నారు.

అలరించిన భక్తి రంజని



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో చెన్నైకి చెందిన ఆర్ పద్మా చక్రవర్తి, ఎస్. నాగలక్ష్మిల బృందం ఆలపించిన భక్తిరంజని భక్తులను ఆకట్టుకుంది. అమ్మవారి పంచహారతుల సేవ అనంతరం ఆలయ ప్రాంగణంలోని కళావేదికపై పలు కీర్తనలు ఆలపించారు. అనంతరం అమ్మవారి దర్శనం కల్పించిన దేవస్థాన అధికారులు ప్రసాదాలు అందజేశారు.

వివాహితకు అత్తింటి వేధింపులు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): వివాహితను అత్తింటి వారు వేధింపులకు గురి చేయడంతో బాధితురాలు కొత్తపేట పోలీసులను ఆశ్రయించింది. అత్తింటి వారిపై గురువారం ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... టైలర్‌పేట పెనుమాక దేవదాసు వీధికి చెందిన శివజ్యోతి 2021లో పెడనకు చెందిన వీణం సాయి ప్రవీణ్ పవన్‌కుమార్‌ను ప్రేమించి పెద్దల సమక్షంలో వివాహం చేసుకున్నారు. శివజ్యోతి ప్రస్తుతం 49వ డివిజన్ 167వ సచివాలయ పరిధిలో వెల్ఫేర్ డెవలప్‌మెంట్ సెక్రటరీగా విధులు నిర్వహిస్తోంది. పెడనలో కాపురం ఉన్న సమయంలో అత్తింటి వారు శివజ్యోతిని వేధింపులకు గురి చేశారు. దీంతో పుట్టింటి నుంచి రూ. 7 లక్షల భర్త, అత్త పార్వతి ఆడపడుచు విష్ణుమహంతి సరితకు ఇచ్చారు. గత ఏడాది విజయవాడకు బదిలీపై వచ్చిన శివజ్యోతికి ఇక్కడ కూడా వేధింపులు ఎక్కువ కావడంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఘటనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

వైఎస్సార్ సీపీకే అన్ని స్థానాల్లో పోటీ చేసే సత్తా

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి షేక్ ఆసిఫ్



మహానేత వైఎస్సార్ విగ్రహం వద్ద సిద్ధం పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఆసిఫ్ తదితరులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): రాష్ట్రంలో 175 స్థానాల్లో పోటీ చేసే సత్తా వైఎస్సార్ సీపీకి తప్ప మిగిలిన ఏ ఒక్క పార్టీకి లేదని ఏపీ స్టేట్ మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి షేక్ ఆసిఫ్ అన్నారు. ఆ సత్తా ఒక్క వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మాత్రమే ఉందని తెలిపారు. రానున్న ఎన్నికలకు సిద్ధం అంటూ ఏలూరులో జరిగే బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరుతూ పోలీస్ కంట్రోల్ రూమ్ సమీపంలో ఉన్న మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం వద్ద పోస్టర్లను గురువారం షేక్ ఆసిఫ్ ఇతర కార్పొరేటర్లు, చైర్మన్లతో కలిసి ఆవిష్కరించారు. తొలుత నాయకులు వైఎస్ విగ్రహానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆసిఫ్ మాట్లాడుతూ ఇప్పటి వరకూ రాష్ట్రంలో ఏ పార్టీ ఎన్నికలకు అభ్యర్థులను ప్రకటించలేదన్నారు. అందువలనే టీడీపీ, జనసేనలు కలిసి పోటీ చేస్తున్నాయన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి బయటకు వచ్చిన వారికి సీట్లు ఇవ్వాలని ఎదురు చూసే దుస్థితికి టీడీపీ దిగజారిందని విమర్శించారు. రానున్న ఎన్నికల్లో 175కు 175 సీట్లు గెలిచి తీరుతామని పేర్కొన్నారు. అందుకోసం తమ పార్టీ యావత్ క్యాడర్ సిద్ధంగా ఉందని చెప్పారు. అందుకోసమే తమ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి సిద్ధం అని ప్రకటించారన్నారు. టీడీపీ, జనసేన ఇరు పార్టీలు ప్రజలను మోసం చేయటానికి మరోసారి జతకట్టాయని ధ్వజమెత్తారు.

ప్రజల మనోభావాలు దెబ్బతీసిన టీడీపీ, జనసేన...

2014లో టీడీపీ, జనసేనలు కలిసి పోటీ చేసి రాష్ట్రంలో ఆలయాలు, మసీదు, దర్గాలు కూలగొట్టి ప్రజల మనోభావాలను దెబ్బతీశాయని మండిపడ్డారు. విజయవాడలో పాతిక పైగా మందిరాలను కూలగొడితే ప్రజలు తరిమికొట్టారన్నారు. మరోసారి చంద్రబాబు కూటమిని తరిమికొట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని వివరించారు. ఏపీ స్టేట్ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ బండి పుణ్యశీల, సీనియర్ కార్పొరేటర్లు యలకల చలపతిరావు బుల్లా విజయకుమార్ తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో పాతశివాలయం చైర్మన్ బొమ్మ మధు, సింహాచలం దేవస్థానం సభ్యుడు కూరాకుల నాగ, నాయకులు జిలాని, మండల శ్రీను, బాజీ, పైడాడ శ్రీనివాస రావు, ఖాదర్, దొడ్ల రాజా, శిరంశెట్టి పూర్ణ తదితరులు పాల్గొన్నారు.

నగరాభివృద్ధికి ప్రభుత్వం విశేష కృషి

స్థాయీ సంఘం సమావేశంలో మేయర్ భాగ్యలక్ష్మి

పటమట(విజయవాడతూర్పు): నగరాన్ని అభివృద్ధి చేసేందుకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తుందని మేయర్ రాయన భాగ్యలక్ష్మి తెలిపారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూంలో గురవారం స్థాయీ సంఘం సమావేశం నిర్వహించారు. అజెండాలో మొత్తం 25 అంశాలు ప్రతిపాదింగా అందులో 18 ఆమోదిస్తూ సభ్యులు తీర్మానం చేశారు. రెండు అంశాలు వాయిదా వేయగా మూడు ర్యాటిఫై చేశారు. ఒక అంశాన్ని రికార్డు చేయగా, మరో అంశాన్ని ధ్రువీకరిస్తూ తీర్మానించారు. ఆయా విభాగం అధికారులు, స్థాయీ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ప్రధానాంశాలు...

- సర్కిల్–1 పరిధిలోని 44వ డివిజన్ ఆర్ఆర్ నగర్ వాటర్ ట్యాంక్ రిటైనింగ్ వాల్ సీసీ రోడ్డు నిర్మాణానికి అవసరమైన రూ.47.41 లక్షలు వీఎంసీ జనరల్ బడ్జెట్ నుంచి కేటాయించాలని వచ్చిన ప్రతిపాదనను సభ్యులు ఆమోదిస్తూ తీర్మానం చేశారు.
- వీఎంసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రామరాజ్యనగర్, రాజీవ్‌నగర్, కృష్ణలంకలోని మెటర్నిటీ హాస్పటల్స్‌లో వైద్య సేవలు అందిస్తున్న డెంటల్ అసిస్టెంట్ సర్జన్, స్టాఫ్‌నర్స్, హెల్త్ అసిస్టెంట్లు, ల్యాబ్ టెక్నీషియన్స్, ఆయాలు, ల్యాబ్ అటెండెంట్స్ మొత్తం 14 మంది వైద్య సిబ్బంది కాంట్రాక్ట్ పద్ధతిపై విధులు నిర్వహిస్తున్నారు. వీరందరికీ ఈ ఏడాది మార్చిలో గడువు ముగుస్తున్నందున వారికి గడువు పొడిగించాలని వచ్చిన ప్రతిపాదనపై సభ్యులు వాయిదా వేస్తూ తీర్మానించారు.
- సర్కిల్–2 పరిధిలోని భగత్‌సింగ్ రోడ్డు, బీఆర్‌టీఎస్‌రోడ్డు, ఫుడ్ జంక్షన్ నుంచి అజిత్‌సింగ్‌నగర్‌కు వెళ్లే ప్రధాన రహదారి మరమ్మతులకు గురైనందున ఈ రోడ్డులో బీటీరోడ్డు లేయర్ వేయటానికి అవసరమయ్యే రూ.45.51 లక్షలు వీఎంసీ జనరల్ ఫండ్స్ నుంచి విడుదల చేయాలని వచ్చిన ప్రతిపాదను సభ్యులు ఆమోదించారు.



స్థాయీ సంఘం సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ రాయన భాగ్యలక్ష్మి

డ్రెయిన్ల నిర్మాణ పనులకు శ్రీకారం





44వ డివిజన్‌లో డ్రెయిన్లకు శంకుస్థాపన చేస్తున్న రత్నకుమారి, 45వ డివిజన్ కొండ ప్రాంతంలో మెట్ల నిర్మాణం ప్రారంభించిన మాధురీ లావణ్య

భవానీపురం(విజయవాడపశ్చిమ): విద్యాధరపురం లేబర్‌కాలనీలో రూ.23 లక్షల వ్యయంతో రెండు ప్రదేశాల్లో నిర్మించనున్న డ్రెయిన్ల పనులకు 44వ డివిజన్ కార్పొరేటర్ మైలవరపు రత్నకుమారి గురువారం కొబ్బరికాయ కొట్టి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లేబర్‌కాలనీలోని ఆరు బిల్డింగ్‌ల వద్ద నుంచి జీఎస్ఆర్ మున్సిపల్ హైస్కూల్ మీదుగా మెయిన్ రోడ్ వరకు రెండు డ్రెయిన్లు నిర్మించనున్నారని చెప్పారు. అందులో ఒకటి రూ. 7 లక్షలు,, మరొకటి రూ.16 లక్షలని వివరించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మార్గదర్శకత్వంలో నడుస్తున్న పశ్చిమ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు నాయకత్వంలో తాము డివిజన్ అభివృద్ధికి కృషి చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మైలవరపు దుర్గారావు, లేబర్‌కాలనీ ప్రెసిడెంట్ రుషి, వైఎస్సార్ సీపీ నాయకులు పెద్ది రాజారావు, వీరజాల మధు లీల, అంకాని నాగరాజు, వల్లం రవికుమార్, షఫీఉల్లా, ఉస్మాన్ బేగ్, సచివాలయం సెక్రటరీ హర్షిత తదితరులు పాల్గొన్నారు.

45వ డివిజన్ కొండ ప్రాంతంలో

స్థానిక 45వ డివిజన్ పరిధిలోగల గారోజువారి వీధి కొండ ప్రాంతంలో మెట్లు, సైడు కాలువల నిర్మాణ పనులను స్థానిక కార్పొరేటర్ మైలవరపు మాధురి లావణ్య కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కొండపై భాగంలో మెట్లు ధ్వంసం కావడం వలన స్థానికులు రాకపోకలు సాగించేందుకు నానా అవస్థలు పడుతున్న విషయం వారి ద్వారా తెలుసుకున్నానని చెప్పారు. అదే విధంగా మెట్లకు రెండు వైపులా ఉన్న సైడు కాలువలుకూడా పగిలిపోయి మురుగునీరు బయటకు వచ్చేస్తుండటంతో ఆ ప్రదేశంలో పాచిపట్టి జారి పడిపోతున్నారని తెలిసిందన్నారు. దాంతో ఈ రెండు సమస్యలను పశ్చిమ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు దృష్టికి తీసుకువెళ్లానని చెప్పారు. ప్రజల సమస్యలపై తక్షణమే స్పందించే ఆయన సంబంధిత అధికారులతో మాట్లాడి రూ.3.85లక్షలు మంజూరు చేయించారని తెలిపారు. ఆ మొత్తంతో పనులు మొదలు పెట్టామని పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు మైలవరపు కృష్ణ, హుస్సేన్, ముత్తా వాసు, బైపినేని కోటేశ్వరరావు, ముత్యాల రాంబాబు, దావాల బుజ్జి, సీహెచ్ లక్ష్మణ్, ఏలూరు కిరణ్, గుండు లక్ష్మి, రవ్వ కోటేశ్వరి, సచివాలయం సెక్రటరీ బుచ్చిబాబు పాల్గొన్నారు.

కేంద్ర ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్ నామమాత్రమే



ఆడిటర్ అమరసుధీర్

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పార్లమెంట్‌లో కేంద్ర ఆర్థిక మంత్రి ప్రవేశ పెట్టిన ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్ నామమాత్రంగానే ఉందని పలువురు చార్టర్డ్ అకౌంటెట్లు అన్నారు. కాకరపర్తి భావనారాయణ కళాశాల యుజీ, పీజీ కామర్స్ అండ్ మేనేజిమెంట్ స్టడీస్ విభాగాల ఆధ్వర్యంలో కేంద్ర బడ్జెట్‌పై గురువారం సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆడిటర్ సీహెచ్ అమరసుధీర్ మాట్లాడుతూ కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ ప్రస్తుతం పెట్టిన బడ్జెట్ ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్ నామమాత్రమేనన్నారు. ఎన్నికల నేపథ్యంలో చాలా మందికి అనేక ఆశలు ఉంటాయన్నారు. వాటిని మంత్రి తన ప్రసంగంలో పెద్దగా వివరించలేదన్నారు. మరో ఆడిటర్ బీవీఎస్ లింగమూర్తి మాట్లాడుతూ ఎన్నికల్లో ఆకర్షించటానికి పేదలు, యువత, రైతులు, మహిళలు వర్గాలకు సంబంధించిన కొన్ని నిర్ణయాలు చేసినట్లు మంత్రి ప్రకటించారన్నారు. వాటిని పూర్తిస్థాయిలో పరిశీలిస్తే అవి ఎంత వరకూ ఫలితాలని స్తాయో చెప్పవచ్చన్నారు. మరో ఆడిటర్ గుండా గంగాధర్ మాట్లాడుతూ బడ్జెట్‌పై అందరూ అవగాహన పెంచుకోవాలని సూచించారు. ప్రధానంగా మేనేజిమెంట్ విద్యను అభ్యసించే విద్యార్థులు బడ్జెట్ తదితర అంశాలపై మంచి పట్టు ఉంటే చక్కని విజయాలను అందుకుంటారని చెప్పారు. సభకు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నారాయణరావు అధ్యక్షత వహించారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వెంకటేశ్వరరావు, పీజీ డైరెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేష్, విభాగాధిపతులు హేమంత్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

రద్దీ సమయంలో ఇబ్బందులకు గురి కావద్దు



వృద్ధులు, వికలాంగులతో మాట్లాడుతున్న చైర్మన్ రాంబాబు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): అమ్మవారి దర్శనానికి రద్దీగా ఉండే సమయంలో విచ్చేసి ఇబ్బందులకు గురి కావద్దని దుర్గగుడి చైర్మన్ కర్నాటి రాంబాబు వృద్ధులు, వికలాంగులకు సూచించారు. అమ్మవారి దర్శనానికి విచ్చేసిన వృద్ధులు, వికలాంగులకు ప్రత్యేక ఏర్పాట్లు చేయడంతో వాటిని గురువారం చైర్మన్ పరిశీలించారు. ప్రతి రోజు మధ్యాహ్నం 12 గంటలకు అమ్మవారికి మహా నివేదన సమర్పించే తరుణంలోనూ, ఆ తర్వాత గంట వరకు క్యూలైన్లు రద్దీగా ఉంటున్న నేపథ్యంలో వృద్ధులు, వికలాంగులకు ప్రత్యేక దర్శన సమయాన్ని కేటాయించినట్లు రాంబాబు పేర్కొన్నారు. రద్దీ సమయంలో విచ్చేయడంతో తీవ్ర ఇబ్బందులకు గురి కావాల్సి వస్తుందని, ఉదయం 11 గంటల లోపు, మధ్యాహ్నం 2 గంటల తర్వాతే దర్శనానికి విచ్చేసేలా ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. అనంతరం వృద్ధులు, వికలాంగులకు ప్రత్యేకంగా దర్శనం కల్పించడంతో వారు సంతోషం వ్యక్తం చేశారు.

పేదల సంక్షేమానికే పథకాలు

వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి షేక్ ఆసిఫ్



పాత ఆర్ఆర్‌పేటలో స్థానికులకు ప్రభుత్వ పథకాల గురించి వివరిస్తున్న ఆసిఫ్

పూర్ణానందంపేట(విజయవాడ పశ్చిమ): వంద మంది చంద్రబాబులు, పవన్ కళ్యాణులు కలిసి వచ్చినా రాష్ట్రంలో వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిపై గెలవలేరని వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి షేక్.ఆసిఫ్ తెలిపారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గురువారం 56వ డివిజన్ పాత ఆర్ఆర్‌పేటలోని పలు వీధుల్లో ఆయన పర్యటించారు. సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా లేదా అని స్థానికులను అడిగి తెలుసుకున్నారు. ఆయా పథకాల ద్వారా అందుతున్న లబ్ధి గురించి వివరించారు. గత ప్రభుత్వం ఎస్టీ, ఎస్సీ, బీసీ, మైనార్టీ వర్గాలకు తీరని అన్యాయం చేసిందని ధ్వజమెత్తారు. ఆయా వర్గాలను పక్కన పెట్టి తనకు అనుకూలంగా ఉన్న వారికి కొమ్ము కాసి అభివృద్ధి పేరుతో కొట్లాది రూపాయలను దోచి పెట్టిందని మండిపడ్డారు. వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసినప్పటి నుంచి పేద, బడుగు వర్గాల సంక్షేమమే లక్ష్యంగా పని చేసి వారి ఎదుగుదలకు కృషి చేశారన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీష్ మీడియంను ప్రవేశపెట్టి ప్రతి పేద విద్యార్థి ఇంగ్లీష్‌పై పట్టు సాధించి ప్రైవేట్ పాఠశాల విద్యార్థులకు దీటుగా వారు నిలిచేలా చేసిన ఏకైక ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. మహిళల అభ్యున్నతికి కృషి చేస్తున్న ముఖ్యమంత్రికి వారి ఆశీస్సులు మెండుగా ఉంటాయని చెప్పారు. పాత ఆర్ఆర్‌పేటలో గతంలో మంచినీటి సదుపాయం లేదని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత తాగు నీటి పైపులైన్‌లను ఏర్పాటు చేయటమే కాకుండా వాటర్‌హెడ్ ట్యాంక్‌ను ఏర్పాటు చేశారన్నారు. 24 గంటలూ మంచి నీటి సదుపాయం కల్పించిన ఘనత తమ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు.

పశ్చిమంలో అనేక అభివృద్ధి పనులు..

మేయర్ రాయన భాగ్యలక్ష్మి మాట్లాడుతూ పశ్చిమ నియోజకవర్గంలో జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాలనలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయన్నారు. ప్రధానంగా మంచినీరు, రహదారుల నిర్మాణానికి వందలాది కోట్లు ఖర్చు చేశామన్నారు. అంతేకాకుండా నియోజకవర్గంలోని కొండ ప్రాంతాల్లో పాత మంచినీటి పైప్‌లైన్లను తొలగించి కొత్తవి ఏర్పాటు చేశామన్నారు. నియోజకవర్గంలో ప్రజానీకం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి అండగా ఉందని వెల్లడించారు. రానున్న ఎన్నికల్లో తప్పనిసరిగా షేక్ ఆసిఫ్ విజయం సాధిస్తారన్నారు. కార్యక్రమంలో దుర్గామల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం చైర్మన్ కర్నాటి రాంబాబు, కార్పొరేటర్ యలకల చలపతి రావు, నాయకులు వాసా బాబు, రబ్బానీ, పొలిమెట్ల శరత్‌బాబు, గొలగాని శ్రీని, మున్నీ, రషీద్ తదతరులు పాల్గొన్నారు.

చేతుల పరిశుభ్రతతో వ్యాధుల నివారణ



కాంటాక్ట్‌లెస్ హ్యాండ్ వాష్ స్టేషన్‌ను ప్రారంభిస్తున్న వీఎంసీ మేయర్ రాయన భాగ్యలక్ష్మి

పటమట(విజయవాడతూర్పు): చేతుల పరిశుభ్రతే ప్రజల ఆరోగ్యానికి భద్రత అని మేయర్ రాయన భాగ్యలక్ష్మి తెలిపారు. రాజీవ్‌గాంధీ పార్కులో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ, యూనిసెఫ్ సంయుక్తంగా ఏర్పాటు చేసిన కాంటాక్ట్‌లెస్ హ్యాండ్‌వాష్ స్టేషన్‌ను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా భాగ్యలక్ష్మి మాట్లాడుతూ ఒకరు వాడిన హ్యాండ్ వాష్‌ను ఇంకొకరు వాడకుండా ఉండేందుకు కాంటాక్ట్ లెస్ హ్యాండ్ వాష్ స్టేషన్‌ను ప్రారంభిస్తున్నామని చెప్పారు. పార్కుకు వచ్చే ప్రజలు తప్పనిసరిగా ఈ కాంటాక్ట్ లెస్ హ్యాండ్ వాష్ స్టేషన్ వినియోగించుకోవాలని కోరారు. చేతుల పరిశుభ్రత ద్వారా 70 శాతం వ్యాధుల నుంచి రక్షించుకోవచ్చని వెల్లడించారు. కోవిడ్, ఇతర వైరస్‌లను జయించడానికి చేతుల పరిశుభ్రత ఆవశ్యకతపై ప్రతి ఒక్కరికీ అవగహన ఉండాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ (జనరల్) శకుంతల, ఉద్యానవన విభాగం అధికారి చొప్పర శ్రీనివాసులు, మెప్మా, పట్టణ సామాజికాభివృద్ధి విభాగం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక ప్రగతితో విజయాలు




ఒప్పందం చేసుకుంటున్న కళాశాల, ఐఈటీఈ ప్రతినిధులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): విద్యార్థులు సాంకేతిక ప్రగతిని అందిపుచ్చుకున్నప్పుడే మంచి విజయాలను సాధిస్తారని ది ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ టెలి కమ్యూనికేషన్స్ విజయవాడ సెంటర్ చైర్మన్ డాక్టర్ బి.రాజశేఖర్ తెలిపారు. పొట్టి శ్రీరాములు చలవాది మల్లికార్జున రావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ, ఐఈటీఈ స్టూడెంట్ ఫోరమ్ సంయుక్త ఆధ్వర్యంలో ఆ సంస్థ రజతోత్సవాలను పురస్కరించుకొని స్టూడెంట్స్ డే –2024 గురవారం ఆ కళాశాల సెమినార్ హాల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమాలను ప్రారంభించిన డాక్టర్ రాజశేఖర్ మాట్లాడుతూ ఇంజినీరింగ్ విద్యార్థులు వారివారి రంగాల్లో వస్తున్న నూతన ఆవిష్కరణలను తెలుసుకొని ఎప్పటికప్పుడు తమను తాము ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలని సూచించారు. ప్రధానంగా కొత్త అంశాలను తెలుసుకున్నప్పుడే ప్రమాణాలు పెరుగుతాయని చెప్పారు. విద్యార్థులు ఆ దిశగా అడుగులు వేయాలని కోరారు. అందుకోసం ఐఈటీఈ సంస్థ అండగా ఉంటుందని పేర్కొన్నారు. సంస్థ కార్యదర్శి డాక్టర్ సుజిత్ కల్లూరి మాట్లాడుతూ విద్యార్థులకు ఆసక్తి ఉన్న సాంకేతిక అంశాల్లో ఆలోచనల మార్పిడికి, ఉమ్మడి వేదికను అందించేందుకు తమ సంస్థ కృషి చేస్తుందన్నారు. అనంతరం ఐఈటీఈ కళాశాల మధ్య ఒప్పందాన్ని చేసుకున్నారు. కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి పి.లక్ష్మణస్వామి, ప్రిన్సిపాల్ డాక్టర్ జె.లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పేటకు తరలిన స్వామివార్ల విగ్రహాలు

పెనుగంచిప్రోలు: రంగుల మహోత్సవంలో భాగంగా శ్రీగోపయ్య సమేత శ్రీతిరుపతమ్మ అమ్మవారితోపాటు సహదేవతల విగ్రహాలు గురువారం జగ్గయ్యపేటకు రంగులకు తరలివెళ్లాయి. ముందుగా అమ్మవారికి మొదటి బోనం సమర్పించేందుకు ఆలయ అర్చకులు, పాపమాంబ వంశీకులు మునేరు నుంచి నీళ్లు, తీర్థపు బిందె తీసుకు వచ్చారు. విగ్రహాలను రజకులు తలపై పెట్టుకొని గ్రామంలో ఊరేగింపు నిర్వహించి, రంగుల మండపం వద్దకు చేర్చారు. అక్కడి నుంచి ప్రత్యేకంగా అలంకరించిన ఎడ్లబండ్లపై స్వామివార్ల విగ్రహాలు జగ్గయ్యపేటకు తరలివెళ్లాయి. ఎడ్లబండ్ల వద్ద ఆలయ చైర్మన్ జంగాల శ్రీనివాసరావు, సర్పంచ్ వేల్పుల పద్మకుమారి, వైఎస్సార్‌సీపీ నాయకులు మారెళ్ల విజయనరసింహారెడ్డి, గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షులు వేల్పుల రవికుమార్, మండల సమాఖ్య అధ్యక్షురాలు పద్మ తదతరులున్నారు.

విజయవాడ ఆర్డీవోగా భవానీ శంకర్



కలెక్టర్ ఢిల్లీరావును మర్యాదపూర్వకంగా కలిసిన ఆర్డీఓ భవానీశంకర్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): విజయవాడ ఆర్డీఓగా బీహెచ్ భవానీ శంకర్ గురువారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు, జాయింట్ కలెక్టర్ డాక్టర్ పి.సంపత్ కుమార్‌లను మర్యాదపూర్వకంగా కలిశారు. భవానీ శంకర్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఆర్‌డీవో భవానీ శంకర్ మాట్లాడుతూ చాలా కీలకమైన విజయవాడ డివిజన్ అభివృద్ధికి కృషిచేస్తానన్నారు. సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల ఫలాలు ప్రజలకు పూర్తి స్థాయిలో అందించి.. వాటి లక్ష్యాలు నెరవేరేలా కృషి చేస్తానని పేర్కొన్నారు.

15 మద్యం బాటిల్స్‌స్వాధీనం

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): అక్రమంగా విక్రయిస్తున్న 15 మద్యం బాటిల్స్‌ను స్వాధీనం చేసుకోవడంతో పాటు ఒకరిని కొత్తపేట పోలీసులు గురువారం అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కొత్తూరు తాడేపల్లికి చెందిన మట్టా వెంకటేశ్వరరావు అక్రమంగా మద్యం నిల్వ చేసి విక్రయిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో వెంకటేశ్వరరావు ఇంటిపై దాడి చేసి నిల్వ ఉంచిన 15 క్వార్టర్ బాటిల్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు.

రిటైర్డ్ పోలీసు అధికారులు, సిబ్బందికి ఆత్మీయ వీడ్కోలు

విజయవాడస్పోర్ట్స్: ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్‌లో విధులు నిర్వర్తిస్తూ జనవరి 31వ తేదీన ఉద్యోగ విరమణ పొందిన అధికారులు, సిబ్బందికి అడ్మిన్ డీసీపీ మోకా సత్తిబాబు ఆత్మీయ వీడ్కోలు పలికారు. విజయవాడలోని కమిషనరేట్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో రిటైర్డ్ అయిన ఎస్సీ, ఎస్టీ సెల్ ఎస్ఐ సత్యనారాయణ, సింగ్‌నగర్ స్టేషన్ ఏఎస్ఐ హేమచందర్, పటమట స్టేషన్ ఏఎస్ఐ దుర్గారావు, ఏఆర్ ఏఎస్ఐలు రామబ్రహ్మారావు, సాంబశివరావు, సీటీసీ హెడ్‌కానిస్టేబుల్ అబ్దుల్‌మాలిక్, ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్ సత్యనారాయణలను శాలువాలతో సత్కరించారు. సుదీర్ఘకాలం పాటు పోలీస్ శాఖ ద్వారా ప్రజలకు సేవలందించిన వీరిని అభినందించారు.

